చిల్లర



కె.రాజయ్య

"రైట్ రైట్" అన్నకండక్టర్ అరుపుతో సిటీ బస్సు కదిలింది. విజయవాడ బెంజి సర్కిల్ బస్ స్టాప్ నుండి బయలుదేరింది.

నేను ప్రతిరోజూ సాయంత్రం కాలేజీ వదలగానే బెంజి సర్కిల్‌కు వచ్చి అక్కడ నుండి సిటీ బస్సులో కృష్ణలంకలోని నా రూమ్‌కు వెళ్తూ ఉంటాను. బస్సులోని సీట్లన్నీ నిండుగానే ఉండేసరికి నేను, నాతోపాటు మరో నలుగు రయిదుగురు నిలబడే ఉన్నాము.

"టికెట్ టికెట్" అంటూ కండక్టర్ మా వైపు వస్తున్నాడు.

నిలబడి ఉన్నవారిలో ఒక అరవై అయిదేళ్ల వృద్ధుడు ఉన్నాడు. మనిషి నల్లగా, సీలగా ఉన్నాడు. గడ్డం బాగా పెరిగింది. తలజుత్తు బాగా చెదిరి చింపిరి చింపిరిగా ఉంది. అక్కడక్కడ చిన్న చిన్న అతుకులు వేసిన చొక్కాబాగా మాసిన పాతధోవతి ధరించి వున్నాడు.

కండక్టర్ టికెట్ కొరకు ఆ వృద్ధ వ్యక్తి వద్దకు వచ్చాడు.

"కాశేశ్వరావు మార్కెట్‌కు ఇవ్వండి" అన్నాడు ఆ వృద్ధుడు కండక్టర్‌కు ఇరవైరూపాయలనోటు అందిస్తూ.

కండక్టర్ అతనివైపు ఎగాదిగా చూచి, "ఒక రూపాయి చిల్లర ఉంటే ఇవ్వు. రూపాయి టికెట్ కోసం ఇరవై రూపాయల నోటు ఇస్తావేమిటి?!" అన్నాడు ప్రపంచంతో ఉన్న మొత్తం కోపాన్ని, విసుగును తన గొంతులోనికి తెచ్చుకొని.

"లేదు బాబు"

"లేదా? అయితే దిగు దిగు హోల్డ్ ఆన్"

డ్రైవర్ బస్సు ఆపాడు.

"దిగవయ్యా" కండక్టర్ గొంతులో కోపం విసుగు ఎక్కువయ్యాయి. ఆ వృద్ధుడు దీనంగా కండక్టర్ వైపు చూస్తూ అలాగే నిలబడి యున్నాడు.

"దిగమంటుంటే వీక్కాదూ చెప్పేది?" అంటూ గెంటినంత పనిచేశాడు.

"ఛీ ఛీ ఇలాంటివాళ్లు మాపాలిటి యముళ్లు. విసిగించి చంపుతారు" అంటూ మరొక్కసారి విసుక్కున్నాడు ఆ వృద్ధుణ్ని దింపాక.

నాకు ఆ వృద్ధునిపై జాలి కలిగిందే తప్ప కండక్టర్‌పై కోపం కలగలేదు. అందుకు కారణం 'కండక్టర్ జాబ్ చాలా విసుగుతోకూడిన జాబ్' అన్న నా అభిప్రాయమే కావచ్చు. నా ఈ అభిప్రాయమే అతనిపట్ల ఎలాంటి దురభిప్రాయమూ కలగకుండా చేసింది.

కాంధారి బస్‌స్టాప్ వచ్చింది. ఆ స్టాపులో ఒకే ఒక వ్యక్తి మాత్రమే నిలబడి వున్నాడు. ఎత్తుగా, ఎర్రగా హిందీ సినిమా హీరోలా ఉన్నాడు. లాల్చీ, పైజమా ధరించి చాలా నీటుగా ఉన్నాడు. అతను బస్సులోనికి రాగానే అతనితోపాటే వచ్చిన మంచి సెంటువాసన అతని స్థితిని తెలుపుతున్నది. ఆ వ్యక్తి టికెట్ కోసం కండక్టర్‌కు ఏభైరూపాయల నోటు అందిస్తూ "లీలామహల్‌కు" అన్నాడు.

నాకు ఆ వ్యక్తిపై జాలి వేసింది అతను ఎదుర్కోబోయే సమాధానాన్ని ఊహించుకొనే సరికి! అదిగో అప్పుడే జరిగింది ఓ విచిత్రం. కాదు అద్భుతం. కండక్టర్ టికెట్ కోసం ఏభై రూపాయల నోటు తీసికోవడము, టికెట్‌తోపాటు మిగతా చిల్లర ఆ వ్యక్తికి ఇవ్వడము, తన ప్రక్కనే ఆ వ్యక్తికొంత చోటు ఇచ్చి 'కూర్చోండి' అంటూ మహానందంగా అనడము అన్నీ వెంట వెంటనే జరిగాయి.

అంతే! నాకు తెలియకుండానేనా చేతి చూపుడువేలు నాముక్కు మీదికి వెళ్లింది.

రూపాయి టికెట్‌కు ఇరవై రూపాయల నోటుకు చిల్లర ఇవ్వడం సులభమా? లేక నలభై పైసల టికెట్‌కు ఏభైరూపాయల నోట్‌కు చిల్లర ఇవ్వడం సులభమా?

మొదటిదే సులభమని తెలిసినా నేను కండక్టర్‌ను ఏమీ చేయలేకపోయాను పళ్లు పటపట కొర్కోవడం తప్ప.

నేను దిగవలసిన స్థలం వచ్చింది. "అసలు తిరకాసు ఎక్కడ ఉంది?" అంటూ ఆలోచిస్తూ బస్సు దిగాను. సమాధానము స్ఫురించిన వారు తప్పక నాకు తెలుపగలరు.

*